## మనసొంపుగా

# అదృష్టం ఎవరిది?

**అరవింద్‌ని చూడగానే చాలా ఆశ్చర్యం వేసింది! దాదాపు పదేళ్ళ తర్వాత అతన్ని చూస్తున్నాను. అప్పటికంటే కొద్దిగా లావయ్యాడు. బట్టతల వచ్చేసింది. కాని ముఖంలో తేజస్సు, చిరునవ్వు చెరగలేదు. అప్పట్లో కాస్త కుర్రతనంగా వుండేవాడు. ఇపుడు వయసు తెచ్చిన పెద్దరికంతో హుందాగా వున్నాడు. కాని చాలా సింపుల్‌గా వున్నాడు. ఒక షాపింగ్ కాంప్లెక్స్ నుంచి నేను బయటకు వస్తుండగా, నా ఎదురుగా వచ్చి నావంక సూటిగా చిరునవ్వుతో చూస్తున్న అరవింద్‌ని గుర్తుపట్టడానికి కొద్ది క్షణాలు పట్టింది. గుర్తుపట్టగానే ఆశ్చర్యం, ఆనందం కలిగాయి. ఎందుకో తెలీదు కాని చాలా... చాలా కాలం తర్వాత నా మనసు ఎంతో హాయిని, తెలియని అనుభూతిని అనుభవించింది.**

"గుర్తున్నాననుకుంటాను" అన్నాడు అరవింద్.

"ఆ.. ఆ.. అరవింద్.." అన్నాను కొద్దిగా అనుమానంగా.

"అరవింద్‌నే. పేరు కూడా గుర్తున్నందుకు నేను చాలా సంతోషపడుతున్నాను" అన్నాడు అరవింద్.

అతని పేరు చటుక్కున గుర్తుకొచ్చినందుకు నాక్కూడా ఆశ్చర్యం కలిగింది.

"నువ్విప్పుడు ఏం చేస్తున్నావ్?" అడిగాను.

"జిల్లాపరిషత్ స్కూల్‌లో మాస్టర్ని" అన్నాడు అరవింద్.

"నీకప్పుడు ఉద్యోగం లేదు కదూ! ఆ తర్వాత సంపాదించావా? పర్మనెంటేనా?"

"ఉద్యోగంలో చేరి ఎనిమిదేళ్ళయ్యింది. పర్మనెంటే"

"మీ ఆవిడ కూడా ఎంప్లాయేనా? పిల్లలెంత మంది?"

"మొదటి ప్రశ్నకు సమాధానం లేదు. అచ్చమైన గృహిణి. రెండవ ప్రశ్నకు సమాధానం ఇద్దరు" అన్నాడు నవ్వుతూ.

"నీ బడిపంతులు బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు" అన్నాను నేను కూడా అతని నవ్వులో శృతి కలుపుతూ.

"మీరెలా వున్నారు? మీ అమ్మ, నాన్నగారు కులాసాయేనా?" అడిగాడు అరవింద్.

అతని ప్రశ్నతో అతనికి, నాకు వున్న తేడా కొట్టొచ్చినట్టు కనిపించింది. మనసులో నిజంగా సిగ్గుపడ్డాను. నేనతన్ని నువ్వు నువ్వు అని సంబోధించాను. కాని అరవింద్ మాత్రం గౌరవంగా 'మీరు' అని పిలిచాడు. పైగా నేనతనికి యోగ క్షేమాల గురించి అడగనే లేదు. ఉద్యోగం, హోదాల గురించి వాకబు చేశాను. నాకు ఇతరులతో సరిగా మాట్లాడడం చేతకాలేదు. ఆ విషయం నాకు తెలుసు. అయినా అహంభావంతో దానిని కప్పేస్తుంటాను.

"హలో... మీరేదో ఆలోచిస్తున్నట్టున్నారు" అని అరవింద్ నా ముఖంపై చిటికేయడంతో ఈ లోకంలోకి వచ్చాను.

"ఆ... అమ్మా నాన్న బాగానే వున్నారు. ఇదిగో నేనెలా వున్నానో కనిపిస్తూనే వున్నాగా!" అన్నాను.

"మీవారు నారాయణరావుగారు బాగున్నారా! వారి బిజినెస్ బాగా సాగుతోందా?"

"ఆయనకేం బ్రహ్మాండంగా వున్నారు. బిజినెస్సే ఆయన మొదటి పెళ్ళాం."

"మా ఇల్లు ఇక్కడికి చాలా దగ్గర. మా ఇంటికి రండి. అక్కడ హాయిగా కబుర్లు చెప్పుకోవచ్చు" అన్నాడు.

నాకూ అతనింటికి వెళ్ళి అతని స్థితిగతుల్ని పరిశీలించాలనిపించింది. అందుకే 'సరే' అన్నాను. ఇద్దరం బయటకు వచ్చాము. అరవింద్ ఆటోకోసం వెతకబోయాడు.

"నాకు కారుంది. పద కార్లో వెళ్దాం" అన్నాను.

"నాకు స్కూటరుందండి. మీరు కార్లో రండి. నేను దారి చూపిస్తాను" అన్నాడు అరవింద్.

అరవింద్ బాగా తెలిసిన వాళ్ళబ్బాయి. నేనంటే బాగా ఇష్టపడేవాడు. ఆ విషయం నాకూ తెలుసు. నాకూ అరవింద్ అంటే లోలోపల ఇష్టం వున్నట్టు నాకు పెళ్ళయిన తర్వాత తెలిసింది. అసలు అరవింద్‌కు, నాకు పెళ్ళి చేయాలని ఇరు కుటుంబాలలోని కొందరు ప్రయత్నించారు. కాని మా అమ్మ మాత్రం ససేమిరా వీల్లేదంది.

"కాణీకి ఠికాణా లేనివాడికి నా కూతుర్ని కట్టబెట్టను. దానికి పెద్దింటి సంబంధం చేస్తాను. అది మహారాణీ భోగాలు అనుభవించాలి" అని భీకొట్టింది.

అప్పట్లో అరవింద్ ఏదో చిన్న స్కూల్లో టీచర్‌గా చేస్తుండేవాడు. కాని మంచివాడని, గుణవంతుడని అందరూ అనేవారు. 'మంచితనం కూడు పెట్టదు. ఉన్నవాళ్ళింట్లో అయితే అమ్మాయి సుఖపడుతుంది' అనే ధోరణిలో వున్న మా అమ్మ తన ఆశయానికి అనుగుణంగానే ఒక 'బిజినెస్ మాన్'కి నన్ను కట్టబెట్టింది. సంపదకు లోటు లేని ఆ ఇంట్లో నేను మహారాణిలా జీవిస్తున్నాను.

ఇద్దరం అరవింద్ ఇంట్లోకి అడుగు పెట్టాం. నాలుగు గదుల చిన్న పోర్షన్ అది. ముందు వైపున పూలమొక్కలున్నాయి. ముందు గదిలోకి ప్రవేశించగానే అరవింద్ భార్య కాబోలు- వచ్చి నన్ను చూసి క్షణం సేపు ఆగి వెంటనే చిరునవ్వుతో,

"రండి రండి" అని సాదరంగా ఆహ్వానించి కుర్చీ చూపించింది. లోపలికి వెళ్ళి మంచినీళ్లు తెచ్చిచ్చింది.

అరవింద్ తన స్కూటర్‌ని కాంపౌండ్‌లోపల ఖాళీ స్థలంలో పెట్టేలోగానే ఆమె ఈ అతిథి మర్యాదలు చేసింది. అరవింద్ లోపలికి రాగానే,

"మీ ఆవిడే కదూ! పేరు, ఊరు అడక్కుండానే మర్యాదలు చేస్తోందే!" అన్నాను నవ్వుతూ.

"ఎలాగూ ఆయన చెబుతారుగా. అడగడం ఎందుకు?" అంది ఆమె.

"ఆ.. ప్రమీల! వీరు.. నీకు మన పెళ్ళయిన కొత్తలో చెప్పానే మాకు బాగా దగ్గరివారు. అరుణాచలం గారి అమ్మాయి" అని నావైపు తిరిగి "నా భార్య ప్రమీల" అని పరిచయం చేశాడు. ఇద్దరం చిరునవ్వుతో పలకరించుకున్నాం.